

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,20 మే 2025
8 పేజీలు


## అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని
# యోగాశిక్షణ కార్యక్రమాలు




**అమలాపురం,మేజర్‌న్యూస్ :** ఈనెల 21వ తేదీ నుండి జూన్ 21వరకు అంతర్జాతీయ యోగా డే ను పురస్కరించుకుని మండల, గ్రామ, వార్డు స్థాయిలలో ఐదేసి రోజులపాటు యోగ శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్, ఇతర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లుతో ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ విధివిధానాలు,అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని నెలరోజులపాటు యోగా కార్యక్రమాల నిర్వహణ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్,దీపం-2 సబ్సిడీ రాయితీలు చెల్లింపు అంశాలపైప్రజా సంతృప్తి స్థాయిలు,జిల్లా కోర్టులలో మరుగుదొడ్ల నిర్మాణం వంటి అంశాలపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం అధ్యక్షతన రాష్ట్ర ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ ఏర్పాటు చేశారని విధి విధానాలపై అధికారులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు రాష్ట్ర ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ పేరుతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తూ, ప్రాజెక్టులు, పెట్టుబడుల సత్వర కార్యాచరణ కోసం ఏర్పాటు రూ.50 కోట్లు దాటిన ప్రాజెక్టులపై పర్యవేక్షణ వ్యవస్థ వేగంగా కార్యరూపం దాల్చేలాచూసేందుకు ప్రాజెక్ట్‌మానిటరింగ్ గ్రూపునునియమించిందన్నారు.స్వర్ణాంధ్రప్రదేశ్-2047విజన్ లక్ష్యసాధన లో భాగంగా దీన్ని ఏర్పాటు చేసిందని పలు జిల్లాలలో 50 కోట్లు పెట్టుబడి దాటిన ప్రాజెక్టులపై ఈ గ్రూపు మానిటరింగ్ చేస్తుందన్నారు. ప్రాజెక్టుల్ని ఆచరణలోకి తేవడంలో ఎదురవుతున్న ఇబ్బందుల్ని పరిష్కరించి అడ్డంకులు తొలగించడం,అనుమతులు, క్లియరెన్సు వేగంగా వచ్చేలా చూడటం వంటి బాధ్యత ల్ని నిర్వహిస్తుందన్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షులుగా వ్యవహరించే ఈ గ్రూపు కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షులుగా ఉంటారన్నారు. ఇంధన, పరిశ్రమలు, నీటిపారుదల, రోడ్లు, భవనాలు, ఐటీ, పర్యాటక, విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయం, పురపాలక, వైద్య,ఆరోగ్యం తదితరశాఖల ముఖ్యకార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున (జూన్ 21న) రాష్ట్ర స్థాయిలో విశాఖపట్నం నందు ఐదు లక్షలు మందితో ఏర్పాటు చేసే యోగా దినోత్సవం లో ప్రధాన మంత్రి పాల్గొంటారని తెలిపారు. ఈనెల 21 నుండి జూన్ 21 వరకు గ్రామం వార్డు మండల స్థాయిలలో శిక్షణ కార్యక్రమాలు మూడు దశలలోనూ నిర్వహిస్తూ నెలఅంతా యోగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించి యోగా ప్రతి ఒక్కరి జీవనశైలిలో ఒక భాగంగా అందరూ అలవర్చు కునేలా ప్రభావవంతమైన ముద్రను వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేప ట్టిందన్నారు. అంతర్జాతీ య యోగా దినోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు, ఆ యుష్, స్పోర్ట్స్ యోగా నిపుణులు అందరూ సమన్వయం వహించి ఆరోగ్య శైలిలో యోగ విలువను, ప్రభావాన్ని


- తరువాయి 2లో..




## రైతుల నుండి ప్రతి గింజ కొనుగోలు చేయాలి ..
### - ఎమ్మెల్యే నల్లమిల్లి

**అనపర్తి, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గంలో ఏ రైతు కూడా తను పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ఇబ్బంది పడకూడదని, రైతుల నుండి ప్రతి గింజ కొనుగోలు చేయాలని అగ్రికల్చర్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సోమవారం రామవరం గ్రామంలో అగ్రికల్చర్ అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం రైతులకు అండగా నిలవాలని, ఏ రైతుకి ఇబ్బందులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులతో ఎమ్మెల్యే అన్నారు. అనపర్తి, రంగంపేట,పెదపూడి మండలాలకు సంబంధించిన టార్గెట్స్ పూర్తి అయ్యాయని, బిక్కవోలు మండలానికి సంబంధించి ఇంకా టార్గెట్స్ కావాలని అధికారులు ఎమ్మెల్యే దృష్టిలో పెట్టారు. వాటి కోసం కృషి చేస్తానన్న ఎమ్మెల్యే అన్నారు.



## పిఠాపురం పిజిఆర్ఎస్‌కు
# 49 అర్జీలు
### -పాడా పీడీ ఏ.చైత్ర వర్షిణి

**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** పిఠాపురం పీజిఆర్ఎస్ కార్యక్రమంలో 49 అర్జీలు వచ్చినట్లు పాడా పీడి ఏ. చైత్ర వర్షిణి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. పిఠాపురం ఏరియా డవలప్మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో సోమవారం నిర్వహించినపీజీఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి పాల్గొని, పిఠాపురం పరిసర ప్రాంతాల ప్రజలు నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పాడా పీడీ చైత్ర వర్షిణి మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ అంశాలపై 49 అర్జీలు అందాయన్నారు. ఇందులో రెవెన్యూ -13, మునిసిపాలిటీ-25,ఇతరములు-11వచ్చాయని తెలిపారు. ఈఅర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ వసంత మాధవి, పిఠాపురం కమిషనర్ కనకారావు, తహసీల్దార్ గోపాల కృష్ణ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుంది
### - పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ వంగా గీత విశ్వనాథ్



**పిఠాపురం, మేజర్‌న్యూస్ :** వైయస్సార్‌సీపీలో కష్టపడి పని చేస్తున్న ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని, పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని వైయస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ వంగా గీత అన్నారు. మాజీముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో పిఠాపురం నియోజకవర్గంలో అన్ని అనుబంధ విభాగ కమిటీలను పూర్తి చేయడం జరిగిందని, ఈ కమిటీల్లో కార్యకర్తలకు పెద్దపీట వేస్తూ... అనుబంధ కమిటీలను వేయడం జరిగిందన్నారు. పార్టీ ఎప్పుడు ప్రజలకు చేరువగా ఉండే విధంగా ప్రణాళికల రూపొందిస్తున్నామని, కార్యకర్తలకు అన్ని విధాలుగా పార్టీఅండగా ఉంటుందని, పిఠాపురం నియోజకవర్గంలో వైసిపి జెండాఎగిరేవిధంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైయస్సార్ సీపీ కార్యకర్తలపై కక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని, కూటమి నేతలు సాగిస్తున్న అరాచకపాలన గురించి ప్రజల్లోకి తీసుకెళ్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## "మినీ మహానాడు" విజయవంతం చేయండి
### -పెరవలి మండల టిడిపి అధ్యక్షుడు అధికాలకృష్ణమ్మ

**పెరవలి,మేజర్‌న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గం స్థాయి మినీ మహానాడుకు పెరవల్లి మండల తెదేపా శ్రేణులందరూ కదలి రావాలని పెరవలి మండల తెదేపా అధ్యక్షుడు అతికాల కృష్ణమ్మ కోరారు.మే 20వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వేలివెన్ను గ్రామంలో గల రైతుసంఘం భవనం నందు నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి,టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిడదవోలు మాజీ శాసన సభ్యులు మరియు తెలుగు దేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అధ్యక్షతన నిడదవోలు నియోజకవర్గ "మినీ మహానాడు" నిర్వహించడం జరుగుతుంది అని అతికాల కృష్ణమ్మ అన్నారు.కావున ఈకార్యక్రమానికి పెరవలి మండల తెలుగుదేశం పార్టీనాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరు కావలసినదిగా కోరారు.

# నిస్వార్థ సేవలు అందించిన ప్రజానాయకుడు నీలం సంజీవరెడ్డి -ఎమ్మెల్యే నల్లమిల్లి



**అనపర్తి, మేజర్‌న్యూస్ :** ఎలాంటి హంగు ఆర్భాటలు లేకుండా నిస్వార్థ సేవలు అందించిన ప్రజానాయకుడు భారత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి అని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా మండలంలోని, రామవరం గ్రామంలో సంజీవరెడ్డివిగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు .ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రిగా, పార్టీ అధ్యక్షుడిగా వివిధ పదవులను అలంకరించి,ప్రజల మన్ననలను పొందిన రాజకీయవేత్త నీలంసంజీవరెడ్డి అని,రాజకీయవారసత్వాన్ని ప్రోత్సహిస్తున్న తరుణంలో వాటిని వ్యతిరేకించి ఎలాంటి హంగు ఆర్భాటాలకి పోకుండా నిస్వార్థ సేవలు అందించిన ప్రజా నాయకుడు నీలం సంజీవ రెడ్డి అని,ముఖ్యంగా లోకసభాపతిగా ఎన్నికకాగానే తన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి అధికారపక్ష -ప్రతిపక్షం మంచి వాతావరణం ఏర్పరచి స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన రాయలసీమ రాజకీయ ఆణిముత్యం మన నీలం సంజీవరెడ్డి అని అన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆయన చూపిన మార్గంలోనే నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి మండలం ఎన్డీఏ నాయకులు, రామవరం గ్రామ ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీ గత ఐదేళ్లలో ఆర్ధికంగా దెబ్బతింది

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జగన్ ప్రభుత్వంలో గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని.. ఆర్థికంగా దెబ్బతిన్నదని మంత్రి ఆనం రామానారాయణరెడ్డిఆరోపణలు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర, రాష్ట్రాల నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి ఉందని అన్నారు. గ్రామాల్లో కనీసం తట్టెడు మట్టి వేసిన దాఖలాలు లేవని చెప్పారు. గతంలో ఎప్పుడూ రెండోపంటకు లక్షాయాభై వేల ఎకరాలకు మించి సాగునీరు ఇవ్వలేదని.. ఈ ఏడాది 5లక్షల 50వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని తెలిపారు.జలజీవన్ మిషన్‌లో ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చామని మంత్రి ఆనం రామానారాయణరెడ్డి గుర్తుచేశారు. ఇవాళ(సోమవారం) నెల్లూరులో మంత్రి ఆనంరామానారాయణరెడ్డి పర్యటించారు.ఈసందర్భంగా మంత్రిఆనంరామానారాయణరెడ్డి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలకు రూ.1200 కోట్ల నిధుల కేటాయింపులు చేశామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనదైన శైలిలో పనిచేస్తూ ఏపీ రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకునేలా చేశారని మంత్రి ఆనం రామానారాయణరెడ్డి ఉద్ఘాటించారు.గతంలో ఏరోడ్డులో వెళ్లినా గుంతలు ఉండేవని చెప్పుకొచ్చారు. రోడ్లకు తమ ప్రభుత్వంలో రూ.850కోట్లు కేటాయించి, గుంతలులేకుండా చేశామని మంత్రి ఆనం రామానారాయణరెడ్డి వెల్లడించారు.తమ ప్రభుత్వంలో బీపీసీఎల్, ఇండోసిల్ ప్రాజెక్టులు ఏపీకి వచ్చాయని మంత్రి ఆనం రామానారాయణరెడ్డి తెలిపారు. రామాయపట్నం పోర్టుకు తోడుగా దుగరాజపట్నం పోర్టును తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. దగదర్తిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం ప్రారంభం కాబోతుందని చెప్పారు. తమ ప్రభుత్వంలో ప్రతి



నెల ఒకటో తేదీన పెంచిన 68లక్షల ఫించన్లు పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. ఎన్ని కష్టాలున్నా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని అన్నారు. ఇవాళా, రేపో తల్లికి వందనం, బస్సుల్లో రాయితీలు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను కార్యకర్తలు గ్రామాల్లో వివరించాలని సూచించారు. అప్పుడే ఏ పార్టీ కూడా టీడీపీ దరిదాపులోకి కూడా రాదని అన్నారు. పారిశ్రామికవేత్తలను ప్రాధేయపడి మంత్రి నారా లోకేశ్ ఏపీకి పరిశ్రమలు తెస్తున్నారని చెప్పారు. నెల్లూరు జిల్లాలో టీడీపీ నేతలు, కార్యకర్తలు అంతా ఒక్కటిగా కలిసి ప్రజల కోసం పనిచేస్తున్నారని మంత్రి ఆనం రామానారాయణరెడ్డి పేర్కొన్నారు.

# వారిపై స్పెషల్ ఫోకస్ పెట్టండి..

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ..

**అమరావతి,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో అంతర్గత భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లేఖ రాశారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం రాష్ట్రంలో ఉగ్రవాద కదలికలపై నిరంతర అప్రమత్తత అవసరమని, తీర ప్రాంత జిల్లాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోహింగ్యాలు, ఉగ్రవాద సానుభూతిపరులు, స్లీపర్ సెల్స్ ఉనికిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దేశ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉగ్రవాద కదలికలు, వారి సానుభూతిపరుల జాడలపై అప్రమత్తంగా ఉండాలని లేఖలో పేర్కొన్నారు.విజయనగరంలో ఒక యువకుడికి ఐసిస్‌తో సంబంధాలున్నాయని, పేలుళ్లకు కుట్ర పన్నిన విషయాన్ని తెలుగురాష్ట్రాల నిఘావర్గాలుగుర్తించి అరెస్టు చేసిన క్రమంలో రాష్ట్ర పోలీసులు మరింత కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించాలన్నారు. ఉగ్రవాద సానుభూతిపరులు, స్లీపర్ సెల్స్,అక్రమ వలసదారులు, రోహింగ్యాల ఉనికిపై,అలాంటివారి కదలికలపైనా అన్నిజిల్లాల అధికారులు తక్షణం అప్రమత్తం అవ్వాలని సూచించారు. ఎక్కడైనా ఉగ్ర నీడలు, వారి జాడలు కనిపిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమగ్ర




విచారణ చేపట్టాలన్నారు.ముఖ్యంగా తీర ప్రాంత జిల్లాల పరిధిలో ఈ తరహా కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.రాష్ట్ర పోలీసు యంత్రాంగం శాంతిభద్రతలతోపాటు అంతర్గత భద్రతపైనా ప్రత్యేక దృష్టి సారిస్తే కేంద్ర ప్రభుత్వ చర్యలకి ఏపీ సహకారం తోడవుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

# అంతర్జాతీయ యోగా దేను పురస్కరించుకుని యోగాశిక్షణ కార్యక్రమాలు

మొదటిపేజి తరువాయి

వెలుగెత్తి చాటాలన్నారు. యోగ శారీరక మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచ డానికి ఒక అద్భుతమైన మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ దినచర్యలో చేర్చుకుని ప్రయోజనాలు పొందాలన్నారు ప్రభుత్వ పనితీరుకు ప్రజా సంతృప్తి కొలమానంగా భావించి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ వాహనాల ద్వారా నిత్యవసరాల సరఫరా నాణ్యత సంతృప్తి స్థాయిల పారామీటర్లను నెలవారీగా యాదృచ్ఛికం గా తనిఖీ చేస్తూ ప్రజా సంతృప్తి స్థాయిలను మెరుగుపరచాలని ఆదేశించారు. ప్రతి అధికారి తమ స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ప్రజా సంతృప్తి స్థాయిలను మెరుగుపరచాలన్నారు.అదేవిధంగాదీపం-2 రియంబర్స్మెంట్ నిధులు సక్రమంగా జమవుతున్నది లేనిది పర్యవేక్షించాలన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలలో కోర్టులకు అనుబంధంగా మరుగు దొడ్లు నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో పది కాలాలు నిలిచే విధంగా ఆర్అండ్‌బిశాఖకు అప్పగించి, అందుకు అవసరమైన భూసేకరణ కూడా చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిషాంతి,డిఆర్ఓ రాజకుమారి పాల్గొన్నారు.

# జర్నలిజంలో అలుపెరగని వ్యక్తి కొమ్మన..బిందాన సురేష్

## ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ కొమ్మన సతీష్ జన్మదిన వేడుక...



**కాకినాడ రూరల్, మేజర్‌న్యూస్ :** జర్నలిజంలో నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ కలంతో అలుపెరగని పోరాటం చేస్తున్న మహోన్నతమైన వ్యక్తి హైకోర్టు న్యాయవాది జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్య దినపత్రిక ఉభయగోదావరి జిల్లాల బ్యూరో చీఫ్ కొమ్మన సతీష్ అన్నయ్య అని జర్నలిస్ట్ బిందాన సురేష్ కొనియాడారు. స్థానిక పేర్రాజుపేట కొమ్మన సతీష్ నివాసంలో జర్నలిస్ట్ బిందాన సురేష్,సీనియర్‌సిటిజన్ వెలుగుబంట్ల విజయ కుమార్ ఆయనని మర్యాదపూర్వకంగా కలిసి కేక్‌కట్ చేయించి అనంతరం సాలువతో ఘనంగాసత్కరించి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు జన్మదిన తెలియజేశారు.ఈ సందర్భంగా జర్నలిస్ట్ బిందాన మాట్లాడుతూ ఎప్పుడూ అందరితోనూ నవ్వుతూ నవ్విస్తూ ఏ కష్టం వచ్చినా ముందుకు వచ్చి జర్నలిస్టు సమస్యపై స్పందించే మనసున్న మంచి మనిషి కొమ్మన సతీష్ అని ఆ కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి కరుణాకటాక్షాలు ఎప్పుడూకలగాలని కోరుకున్నట్లు తెలిపారు.

# క్యాబినెట్ భేటీలో చర్చించే అంశాలివే..

**అమరావతి:** ఏపీ సచివాలయంలో రేపు ఉదయం 11 గంటలకు రాష్ట్రమంత్రివర్గం సమావేశం కానుంది.సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈక్యాబినెట్ భేటీ జరగనుంది.ఈభేటీలో సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఎస్ఐపీబీ6వ సమావేశంలో అమోదించిన పలు సంస్థల ప్రతిపాదనలను ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 33 వేల కోట్ల పెట్టుబడులను మంత్రి వర్గం ఆమోదించున్నారని సమాచారం.పోలవరం -బనకచర్ల ప్రాజెక్ట్‌కు పాలన పరమైన అనుమతులకు అమోదం పైనాక్యాబినెట్లో చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పాలన పూర్తి కావస్తున్న సందర్భంగా రాష్ట్ర అభివృద్ధిపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ జరగనుంది.

# ప్రముఖ పారిశ్రామిక వేత్త సత్తి శ్రీనివాసరెడ్డికి పితృ వియోగం



అనపర్తి,మేజర్‌న్యూస్: రైస్ మిల్లు రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన ప్రముఖ వ్యాపారవేత్త సత్తి కొండారెడ్డి, నిరంతర ప్రజా సేవకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త సత్తి శ్రీనివాసరెడ్డి వార్ల తండ్రి సత్తి సూరారెడ్డి ( 90) శుక్రవారం మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రథమ కుమారుడు సత్తి కొండారెడ్డి గతంలో రైస్ మిల్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. చిన్న కుమారుడు సత్తి శ్రీనివాస రెడ్డిలు రైస్ మిల్లు వ్యాపారంలో ప్రసిద్ధి గాంచి, ప్రముఖ పారిశ్రామికవేత్తగా పేరు ప్రఖ్యాతులు పొంది, సామాజిక సేవా కార్యక్రమాలకి ఇతోధిక సహాయం చేస్తూ, గ్రామ అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందిస్తూ వివిధ రంగాల్లో అభ్యున్నతి సాధించి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. వారి తండ్రి సూరారెడ్డి చూపించిన బాటలో పయనిస్తూ పొలమూరు, బిక్కవోలు, కానేదు తదితర ప్రాంతాల్లో రైస్ మిల్ ఇండస్ట్రీలను నిర్మించి తద్వారా అనేక మందికి జీవనోపాధి కల్పిస్తున్నారు. గతంలో సత్తి సూరారెడ్డి గ్రామంలో కమ్యూనిటీ హాలు, దేవాలయాల నిర్మాణం మరియు గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించారు. వయోభారం రీత్యా ఇటీవల అనారోగ్యానికి గురైన సూరారెడ్డి మృతి పట్ల రాజకీయ, సామాజిక, సేవా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు తమ సంతాపం తెలియజేశారు. స్థానిక శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ శాసనసభ్యులు సత్తి సూర్యనారాయణ రెడ్డి , పూర్వపు శాసనసభ్యులు నల్లమిల్లి శేషారెడ్డి , పుదుచ్చేరి మాజీ మంత్రివర్యులు మల్లాడి కృష్ణారావు .తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షులు భరత్ భూషణ్ మరియు గజల్ విద్వాంసుడు, ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ సంతాపం తెలియజేశారు.

# నాటు సారా అమ్మకాలు చేస్తే బైండోవర్ కేసులు



రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ గ్రామాల్లో నాటు సారా తయారు చేసినా, అమ్మినా బైండోవర్ కేసులు నమోదు చేసి, ఆపై రిమాండ్ పై జైలుకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఎక్సైజ్ సిఐ శ్రీధర్ సోమవారం తెలిపారు. రంపచోడవరం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాలు మేరకు దేవీపట్నం మండలం అంగులూరు గ్రామస్తురాలు కుంజం పోశమ్మ గతంలో బైండోవర్ అయి ఉండి మరలా కేసులో నమోదు అయినందున ముద్దాయిని దేవీపట్నం మండల తహసిల్దార్ ఎదుట హాజరు పర్చగా రూ.పదివేలు అపరాధ రుసుము ప్రభుత్వానికి జమ చేయడం జరిగిందన్నారు. అలాగే నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వివిధ కేసులలో ముద్దాయిలుగా ఉన్న నేరస్తులు కోసం స్పెషల్ డ్రైవ్ రైడ్ లు నిర్వహించి ఐదుగురు పాత ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ పై జైలుకు పంపడం జరిగిందని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎవరైనా నాటు సారా తయారుచేసినా అమ్మినా లేదా సారా సంబంధిత నేరాలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సారా కేసుల్లో పట్టుబడితే కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తారని, ఒకవేళ మరలా పట్టుబడితే మండల తాసిల్దారు ఎదుట హాజరు పరిచి రూ. ఒక లక్ష రూపాయలు వరకు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. అయినప్పటికీ మరలు సారా నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ ఉపయోగించి, ఒక సంవత్సరం వరకు రిమాండ్ ఉండే విధంగా జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. ఎవరి వద్దనైనా నాటు సారా సంబంధిత సమాచారం ఉంటే రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని, ఈవిధంగా సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని రంపచోడవరం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు.


# జర్నలిస్టుపై ఫేక్ ప్రకటనలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

**సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషుబాబ్జి డిమాండ్**



పిఠాపురం, మేజర్ న్యూస్ : ప్రజాశక్తి విలేఖరి ముమ్మిడి లక్ష్మణ్ ను కించపరుస్తూ, డీగ్రేడ్ చేస్తూ, అవమానం చేస్తూ... ఫేక్ ప్రకటనలు ఇచ్చిన వారిపై చర్య తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వ శేషుబాబ్జి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మట్టి మాఫియాపై పోరాడుతున్న రైతులకు ముమ్మిడి లక్ష్మణ్ సంఘీభావం ప్రకటించడంతో అందుకు ప్రతి చర్యగా అతనిని కించపరుస్తూ దుష్ప్రచారం చేస్తున్న వాళ్ళు మట్టి మాఫియాలేనని విమర్శించారు. ఆయన నకిలీ విలేకరి అని ప్రచారం చేస్తున్నారని, లక్ష్మణ్ ప్రజాశక్తిలో గత 20 ఏళ్లుగా సేవలందిస్తున్నారన్నారు. ఆయన నకిలీ విలేకరి కాదని, ప్రజాశక్తి విధానాలకు, విలువలకు కట్టుబడి పనిచేసే జర్నలిస్ట్ అని తెలిపారు. ఆయనపై ఎవరో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు, ఆయనను అరెస్టు చేసినట్లు ఫోటో షాప్ లో ఒక ఫేక్ పోస్టర్ తయారు చేశారని, పోలీసులు అరెస్టు చేయకుండానే చేసినట్లుగా తప్పుడు ప్రకటన ఇచ్చిన వారిపై చర్య తీసుకోవాలన్నారు. మట్టి మాఫియాకు నిజాయితీ ఉండి ఉంటే తమ పేరు, ఇంటి పేరు ఊరుతో ప్రకటన ఇచ్చి ఉండేవారన్నారు. మట్టి తవ్వుకు పోవడానికి వ్యతిరేకంగా ఆ గ్రామ రైతులు ఉద్యమించారని, ఆ గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో లక్ష్మణ్‌పై కక్ష గట్టారన్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు ఎవరు భయపడరని, ఈ విషయంపై తాము పోలీస్ అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తున్నామన్నారు. మట్టి మాఫియా కు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందని దువ్వ శేష బాబ్జి తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 అర్జీలు



పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ : సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 8 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు తెలిపారు. ఈఅర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఏఓ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ కార్యాలయ ఏఓ మైథిలి, హౌసింగ్ ఏఇ రవిశంకర్, హెచ్‌డబ్ల్యూఓలు అబ్బులు, రమేష్, ఐసిడిఎస్ సిబ్బంది రమణమ్మ, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం ప్రింట్ మీడియా సౌజన్యంతో మజ్జిగ పంపిణీ..



ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : ఏలేశ్వరం ప్రింట్ మీడియా సౌజన్యంతో వివేకానంద సేవా సమితి అధ్యక్షులు మైరాల నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఏలేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ వాగు రాజేష్, ప్రింట్ మీడియా సభ్యులు,టిడిపి నాయకులు బుగతా శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ వివేకానంద సేవా సమితి అధ్యక్షులు మైరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతి సోమవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, ఈ సోమవారం ఏలేశ్వరం ప్రింట్ మీడియా సంఘం ఆర్థిక సహకారంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు ఆయన మీడియా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు,ప్రింట్ మీడియా సభ్యులు, వివేకానంద సేవా సమితి సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం



కొత్తపేట, మేజర్ న్యూస్ : ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే కొత్తపేట మండలం వాడపాలెం గ్రామానికి చెందిన గంధం నాగేశ్వరరావు(40) కూలీ పని చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నాడు. ఇదిఇలా ఉండగా ఆదివారం రాత్రి కొత్తపేట శివాలయంలో బంధువుల పెళ్లి కి వెళ్తున్నానని తన భార్యకు చెప్పి వెళ్ళాడు.శివాలయం సమీపంలో ఉన్న బస్టాండ్ వద్ద నిలబడి ఉండగా అమలాపురం నుండి రావులపాలెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా,నిర్లక్ష్యంగా నడుపుతూ సదరు వ్యక్తిని ఢీకొట్టగా రోడ్డుపై పడిపోవడంతో రక్తపు గాయాలయ్యాయి. వెంటనే తన బంధువులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.వైద్య పరీక్షలు చేసి చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ సంఘటనపై మృతిని భార్య గంధం దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర తెలిపారు.

# గ్రీవెన్స్‌కు 43 దరఖాస్తులు



**రంపచోడవరం,మేజర్‌న్యూస్** : రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, ఐటీడీఏ ఏపీవో జనరల్ డి.ఎన్.వి. రమణ నిర్వహించారు. ఈసందర్భంగాఐటీడీఏ ప్రాజెక్ట్ సింహాచలం మాట్లాడుతూ వివిధ సమస్యలపై ఈవారం 43 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. రంపచోడవరం మండలం గుంజు గూడెం గ్రామంలో వీధి రోడ్ల మధ్యలో కల్వర్టులు ఏర్పాటు చేయాలని, ఆర్ అండ్ బి రోడ్ నుండి గుంజుగూడెం గ్రామం వరకు 200 మీటర్లకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని మడిచర్ల సర్పంచ్ చిలకల విజయశాంతి, చిలకల సత్యనారాయణ, కడబాల నూకయ్య, కడబాల ప్రసాద్ వినతి పత్రాన్ని అందజేశారు. మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయితీలో కొండపోడుపట్టాల భూములలో కొండపోడు వ్యవసాయం చేసుకుంటున్న వారిని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు కొండపోడు వ్యవసాయం చేయనివ్వడం లేదని కొండపోడు వ్యవసాయం చేసుకొనుటకు అనుమతి మంజూరు చేయాలని కోరారు. అలాగే పుల్లంగి, గుండ్రాతి గ్రామాలలో సెల్ టవర్స్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అద్దరి వలస నుండి పుల్లంగి గ్రామ వరకు 800 మీటర్లు బీటీ రోడ్ ఏర్పాటు చేయాలని పుల్లంగి పంచాయతీ సర్పంచ్ జార్జ్ బాబు, అందాల మంగిరెడ్డి, సోమిరెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజువొమ్మంగి మండలంలో డి.మల్లవరం నుండి కింద్ర గ్రామం వరకు 11/2 కిలోమీటర్లకు రోడ్డు పనులు ప్రారంభించి మధ్యలో ఆపి వేయడం జరిగిందని, వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి రోడ్డు పూర్తి చేయాలని కదుల ప్రవీణ్ కుమార్, కదుల అచ్చిరాజు, పగి రమణ వినతి పత్రాన్ని అందజేశారు. అడ్డతీగల మండలం అనిగేరు గ్రామంలో రేషన్ కార్డు, ఆర్ఓఎఫ్ ఆర్ పట్టాలు మంజూరు చేయాలని రెడ్డి రాజ్యలక్ష్మి, మడక నాగేశ్వరరావు దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి మండలం చెరుకుంపాలెం పంచాయతీ సంజీవ నగర్ గ్రామంలో గ్రామ దేవత గంగలమ్మ గుడి గ్రామస్తులు అందరూ కలిసి ఏర్పాటు చేసుకుంటున్నామని, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు గంగాలమ్మ గుడి కట్టనివ్వడం లేదని, గంగాలమ్మ గుడిఏర్పాటు చేసుకొనుటకుఅనుమతిమంజూరు చేయాలని మడకంసత్యనారాయణ,చేపలక్ష్మి, కడబాల వెంకటలక్ష్మి దరఖాస్తు సమర్పించారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**మలేరియా ప్రబలకుండా స్ప్రేయింగ్ చేయాలి..** రంపచోడవరం ఏజెన్సీ గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా ప్రతి గ్రామంలో పాగింగ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం సోమవారం తెలిపారు. ఏజెన్సీ ఏడు మండలాల పరిధిలోని గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా దోమల నిర్మూలించేందుకు పాగింగ్ చేయించాలన్నారు. ప్రతీ గ్రామ సచివాలయు పరిధిలో పాగింగ్ మిషన్లు రిపేర్లు ఉంటే వాటిని వెంటనే రిపేర్లు చేయించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అన్ని గ్రామాలలో నీటి గుంటలు ఉన్న వాటిని గుర్తించి ఆయా ప్రాంతాలలో తప్పనిసరిగా పాగింగ్ చేయించాలని, అదేవిధంగా అన్ని మండలాల ఎంపీడీవోలు, గ్రామ సచివాలయాలు పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. పాగింగ్ చేయించడంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏజెన్సీ ఏడు మండలాల పరిధిలోని గ్రామాల్లో రక్తహీనత ఉన్న వారిని గుర్తించేందుకు డాక్టర్ స్పందన పర్యవేక్షణలో వైద్యాధికారులు హరికృష్ణ, సాయిరతన్,కెవిన్,నాగార్జునను ఒక టీముగా ఏర్పాటు చేసామని తెలిపారు. అలాగే ప్రతీ గ్రామంలో రక్తహీనత ఉన్న వారిని అదేవిధంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు వైద్యాధికారులను నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్** : పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు చేపట్టిన ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె సోమవారానికి 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ నాయకులు మాట్లాడుతూ తమన్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో సుంకరనాగేశ్వరరావు, కోనాల వెంకటరమణ, బొమ్మన రవికుమార్,తూతిక సాయి, అరుణ్, షేక్ బషీర్, సుంకర సత్తిరాజు,బాసినభద్రరావు,జి.నాగేశ్వరరావు,జి.సతీష్, బి.భద్ర రావు, బి.భాస్కర్,పూల ప్రశాంత్,ఓ.సోనియా పాల్గొన్నారు.



# ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షుడిగా తాడిపూడి బాబు



**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్** : ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షునిగా తాడిపూడి గ్రామానికి చెందిన కుసంపూడి రామకృష్ణంరాజు (బాబు) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కొత్తపేటలోని కృష్ణదేవరాయ కాపు కళ్యాణమండపంలో జరిగిన మినీ మహానాడు అనంతరం కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు టిడిపి అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షునిగా కుసంపూడి రామకృష్ణంరాజు (బాబు)ను తెలుగు రైతు అధ్యక్షులుగా కరుటూరి వరప్రసాద్ ఐటిడిపి అధ్యక్షుడిగా మధు తెలుగు యువత అధ్యక్షులుగా వెచ్చ అనిల్ బీసీ సెల్ అధ్యక్షులుగా మిద్దె రామకృష్ణ లను నాయకులు కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు ముదునూరి వెంకటరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరినరసింహారావు,మద్దూరి సుబ్బారావు, మండల పరిధిలోని 17 గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆత్రేయపురం మండలటిడిపి అధ్యక్షుడిగా ఎన్నికైన కూసంపూడి రామకృష్ణంరాజు (బాబు)కు పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణంరాజు మాట్లాడుతూ తనపై నమ్మకముతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అప్పగించిన బాధ్యతలనుపార్టీ ఆదేశాలను, శిరసావహిస్తూ నాయకులను, కార్యకర్తలను కలుపుకొని ఆత్రేయపురం మండలంలో టిడిపి మరింత బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు.

## కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ

–యువనాయకుడు మనోజ్ రెడ్డి



**అనపర్తి,మేజర్‌న్యూస్** : కార్యకర్తలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చిన అండగా ఉండి వారిని ఆదుకునే పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్, యువ నాయకుడు నల్లమిల్లి మనోజ్ రెడ్డి అన్నారు. మనోజ్ రెడ్డి ఆధ్వర్యంలో బలబద్రపురం గ్రామంలో అనపర్తి నియోజకవర్గస్థాయి మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసుకున్న మహానాడు కార్యక్రమంలో నాలుగు అంశాలపై తీర్మానించుకోవడం జరిగిందని, ఆ నాలుగు తీర్మానాలను ఈనెల 23వ తేదీన జరిగే జిల్లాస్థాయి మహానాడులో ప్రవేశపెట్టడం జరుగుతుందని, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమానికై ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ విధానంలో భాగంగా అనపర్తి నియోజకవర్గంలో ముగ్గురు కార్యకర్తలకు ఇన్సూరెన్స్ అందించడం జరిగిందని, కార్యకర్తలకు అండగా ఉండే పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేయూత ఆధ్వర్యంలో ఉచిత విద్య



**కాకినాడ, మేజర్ న్యూస్** : రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ మరియు చేయూత సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఒకటో తరగతి నుండి ఏడవ తరగతి వరకు చేయూత హాస్టల్లో ఉచితంగా విద్య బోధించేందుకు పిల్లల నుండి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని చేయూత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మొండి రవికుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో ఉన్న ఏ ప్రాంతం వారైనా ఈ ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని ఆయన వివరించారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాల్సిన ఆఖరి తేదీగా నిర్దేశించామని రవికుమార్ స్పష్టం చేశారు. అనాథ మరియు నిరుపేద పిల్లల ను చదువుకు చేరువ చేయాలన్న ప్రధానాశయంతో ఉచితంగా విద్య, వసతి, భోజనాన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు .2025 –26 విద్యా సంవత్సరానికి ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు కోల్పోయిన వారికి తొలిప్రాధాన్యత, తల్లిని కోల్పోయిన వారికి రెండో ప్రాధాన్యత ,తండ్రిని కోల్పోయిన వారికి మూడో ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని, రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని రవికుమార్ స్పష్టం చేశారు. దరఖాస్తులు పంపేవారుతప్పనిసరిగా ఆధార్‌కార్డు, తల్లి దండ్రులమరణ ధ్రువీకరణ పత్రాల తాలూకు జిరాక్సు జత చేయాల్సి ఉంటుందని, ఇతర వివరాలకు 8639727476, 99899 51788, 9491442220 లలో సంప్రదించాల్సిందిగా రవికుమార్ కోరారు.

## అన్న క్యాంటీన్ భవనానికి శంఖుస్థాపన



**కొత్తపేట,మేజర్‌న్యూస్:** పేదలకు రూ.5కు భోజనం అందించే లక్ష్యంతో స్థానిక కార్పొరేషన్ సత్రం ఆవరణలో సుమారు రూ.50 లక్షల నిధులతో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవనానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు, పలివేల సర్పంచ్ సాదే లక్ష్మీ శ్రీనివాసరావు,విళ్ల మారుతి,ధరణాల రామకృష్ణ,రెడ్డి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

# మాతృత్వం పట్ల గౌరవానికి ప్రతీకగా ఒయాసిస్ జనని యాత్ర




**జగ్గంపేట,మేజర్‌న్యూస్** : జగ్గంపేటలోని నీరజ హాస్పిటల్ వద్ద ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మదర్స్ డేను పురస్కరించుకుని సోమవారం జగ్గంపేటలో ఓఎస్సీ జనని యాత్ర పేరిట ఉచిత మొబైల్ ఫెర్టిలిటీ క్యాంప్ ను నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ యొక్కసైంటిఫిక్ హెడ్ మరియు క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య ఎం మరియు ఒయాసిస్ ఫెర్టిలిటీ యొక్క రీజినల్ మెడికల్ హెడ్ మరియు ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రీతి ప్రియదర్శిని ముఖ్య అతిథులుగా పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మదర్స్ డేని పురస్కరించుకొని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా 30 రోజుల పాటు 30 పట్టణాల్లో 'ఒయాసిస్ జనని యాత్ర' పేరిట ఉచిత మొబైల్ ఫర్టిలిటి క్యాంప్ లు నిర్వహిస్తున్నామని జిల్లాలో ఈరోజు మొదటి క్యాంప్ నిర్వహించడం జరిగిందన్నారు. చాలాకుటుంబాలకు,సంతానోత్పత్తిచికిత్సను తీసుకునేందుకు దూర ప్రాంతాలు,నగరాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ ప్రయాణం ఆర్థిక ఒత్తిడిని మాత్రమే కాకుండా భావోద్వేగ, ప్రయాణ ఇబ్బందులు కలుగుతున్నాయి అన్నారు. ఈ సందర్భంగా ఒయాసిస్ ఫెర్టిలిటీ యొక్క సైంటిఫిక్ హెడ్ మరియు క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య ఎం మాట్లాడుతూ, "జీవనశైలి కారకాలు మరియు ఆలస్యమైన కుటుంబ నియంత్రణ కారణంగా సంతానోత్పత్తి సవాళ్లు యువతను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. అనేక టైర్ 2 మరియు 3 పట్టణాలలో, పరిమిత అవగాహన మరియు ప్రత్యేక సంరక్షణకు ప్రాప్యత ఆలస్యంగా రోగ నిర్ధారణ మరియు చికిత్సకు దారితీస్తుంది. ఒయాసిస్ జనని యాత్ర ద్వారా, పునరుత్పత్తి శాస్త్రంలో తాజా పురోగతుల ద్వారా శక్తిని పొంది, నిపుణుల సంతానోత్పత్తి సంరక్షణ మరియు విద్యను నేరుగా పేద వర్గాలకు తీసుకురావడం ద్వారా మేము దీనిని మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఒయాసిస్ ఫెర్టిలిటీ రీజనల్ మెడికల్ హెడ్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రీతి ప్రియదర్శిని మాట్లా డుతూ, "సంతానలేమి అనేది ఇకపై ఒక వైద్యపరమైన అంశం మాత్రమేకాదు. పెరిగిపోతున్న జీవనశైలి సంబంధిత ఆందోళన కూడా. పీసీఓడీ, తల్లిదండ్రులు కావడంలో జాప్యం, ఒత్తిళ్లు వంటి వాటితో ముడిపడి ఉన్న కేసులు పెరిగిపోతున్న సందర్భంలో సత్వర డయాగ్నసిస్ ఎంతో ముఖ్యం. ఒయాసిస్ జనని యాత్ర ద్వారా మేం నిపుణుల సంరక్షణను, అధునాతన సంతాన సాఫల్యపరిష్కారాలనుప్రతీగుమ్మంవద్దకు తీసుకెళ్లగలుగు తున్నాం, మరీముఖ్యంగా ఈతరహాసదుపాయాలు అంతగా అందుబాటులో లేని ప్రాంతాల్లో. తద్వారా సకాలంలో వారికిఅండగా నిలుస్తూ, తల్లిదండ్రులం కావాలనే కోరిక ఫలించేలా చేస్తున్నాం. అవగాహనను అందుబాటుతో మిళితం చేయడం ద్వారా, ఆయా వ్యక్తులు తమ పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహనతో కూడిననిర్ణయాలుతీసుకోగలిగేలా సాధికారికతను అందిస్తున్నాం. ఒయాసిస్ ఫెర్టిలిటీగురించి-2009లో ఏర్పాటు చేయబడిన ఒయాసిస్ ఫెర్టిలిటీ, భారత్‌లో ఇది 19 నగరాల్లో 31 కేంద్రాలను కలిగిఉంది. తన అధిక ఐవీఎఫ్ సక్సెస్ రేటుకు పేరొందిన ఒయాసిస్ 1,00,000కుపైనా చిన్నారులనుఈప్రపంచంలోకి తీసుకు వచ్చేందుకు తల్లిదండ్రులకు సాయపడింది. స్త్రీ, పురుషులకు విస్తృత శ్రేణికి చెందిన ఫెర్టిలిటీ కేర్ సేవలను అందిస్తున్న ఒయాసిస్, మెడికల్ కౌన్సెలింగ్, డయాగ్నసిస్ మొదలుకొని ఐవీఎఫ్, ఐయూఐ, ఐసీఎస్ఐ వంటి అధునాతన చికిత్సలతో పాటు ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్ ఆప్షన్లను కూడా అందిస్తోంది. సమగ్ర ధోరణికి కట్టుబడిన ఒయాసిస్ శారీరక, భావోద్వేగ, ఆర్థిక ఆందోళనలను పరిష్కరించుకోవడంలో తోడ్పడుతోంది. చికిత్స ఫలితాలు మెరుగయ్యేలా థెరపీలు, పోషక మార్గదర్శకత్వాన్ని కూడా అందిస్తుంది.

# శ్రీ వేణుగోపాల స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి



**పెరవలి, మేజర్ న్యూస్** : నడుంపల్లికోట గ్రామంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి కళ్యాణ మహోత్సవాల లో మే 19వ తేదీ సోమవారం నిడదవోలు మాజీ శాసనసభ్యులు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని అనంతరం స్వామి వారి అఖండ అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి శేషారావు తో పాటు వేలివెన్ను వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాస్, నడిపల్లి గ్రామ సర్పంచ్ బిరా సత్యవేణిరాజు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితుల ఆశలు గల్లంతు



- ఇళ్ల నిర్మాణాలు నిర్వాసితులే నిర్మించుకోవాలి
- ఇళ్ల నిర్మాణానికి స్థలానికి కలిపి మూడు లక్షల 85 వేల రూపాయల మాత్రమే
- ఇంటి స్థలానికి లక్ష రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది

**కూనవరం, మేజర్‌న్యూస్** : సర్వం త్యాగం చేసి ఎన్నో సంవత్సరాలు ఈ ప్రాంతంలో నివసించి రెండు జీవ నదుల మధ్యన వ్యవసాయం సాగిస్తూ ఆనంద జీవితం గడుపుతున్న ఈ ప్రాంత ప్రజలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో తీవ్ర మానసిక వెదకు గురవుతున్నారు తప్పని పరిస్థితులు ఈ ప్రాంతం నుండి తరలి వెళ్లడానికి సిద్ధపడిన ప్రజలు ప్రభుత్వ నిర్ణయాలతో ఆందోళన గురవుతున్నారు సోమవారం నాడు కూనవరం మండల కార్యాలయంలో జరిగిన నిర్వాసితుల అవగాహన సదస్సులో ఎమ్మార్వో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద మూడు ఆప్షన్లు ఉన్నాయని మొదటిది నిర్వాసితులకు ఓటిఎస్ ద్వారా మూడు లక్షల 85 వేల రూపాయలు ఇవ్వటానికి రెండవది స్థలం కేటాయించి రెండు లక్షల 85వేల రూపాయలు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు ఆయన తెలిపారు అయితే ఈ ప్రతిపాదనను అందరూ వ్యతిరేకించారు మాకు స్థలం కేటాయించి ఇంటి నిర్మాణం ప్రభుత్వమే చేపట్టి ఇవ్వాలని పై అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు పాత్రికేయులు పూర్ణ ప్రముఖులు పాల్గొన్నారు టిడిపి నుండి మండల అధ్యక్షులు బరపాటి ప్రకాశి రావు గద్దిపాటి ప్రసాద్ వైసీపీ నుండి ఆవుల మర్యాదాసు భర్త మూర్తి జనసేన నుండి కూనవరం గ్రామ సర్పంచ్ హేమంత్ గాంధీ నరేంద్ర కుమార్ సిపిఐ నుండి డివిజన్ కార్యదర్శి జి మోహన్రావు లవ్ శ్రీను సిపిఎం నుండి తెలగాని నాగరాజు టి శ్రీను పాల్గొన్నారు.

# పిపి యూనిట్ వైద్యులుగా డా.జయేష్ కుమార్



**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** పెద్దా పురం పిపి యూనిట్ వైద్యులుగా (మెడికల్ ఆఫీసర్)గా డా.ఎం .జయేష్ కుమార్ విధులలో చేరారు. ఈయన ఇప్పటి వరకు కాకినాడ జిజిహెచ్, ఎన్ఆర్‌సిల యందు రెండు సంవత్సరాలు చేసి పెద్దాపురం పిపి యూనిట్ వైద్యులుగా రావడం జరిగింది. దీనికిముందుగా డిఎంహెచ్ఓ డా.నరసింహ నాయక్‌ను, డిప్యూటీ డిఎం&హెచ్ఓ డా.పి.సరితను మర్యాదపూర్వకంగా కలుసుకోవడం జరిగింది. ఇప్పటివరకు ఇక్కడ ఒక్కరే డా.ఎల్. అనూషరాయ్ విధులు నిర్వహించేవారు. ఇప్పటి నుండి పిపి యూనిట్ నందు ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యసేవలు అందించనున్నారు. ఈసందర్భంగా డా.జయేష్ కుమార్‌ను పిపియూనిట్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించినవారిలో ఉన్నారు.

# పేకేరు ఛానల్ పూడికతీత పనులు ప్రారంభం

**-రూ 6,75,434 లు అంచనా వ్యయంతో పూడికతీత పనులు**



**పెరవలి, మేజర్ న్యూస్** : పెరవలి మండలం నుండి పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం దానికి వెళ్లే పేకేరు ఛానల్ పూడికతీత పనులను మే 20వ తేదీ సోమవారం పేకేరు నీటి సంఘం అధ్యక్షులు నల్ల సురేంద్ర ప్రారంభించారు. తూర్పుగోదావరి జిల్లా కాకరపర్రు గ్రామం వద్దనుండి పెనుగొండ మండలం పేకేరు గ్రామం వరకు 11.2 కిలోమీటర్ల పొడుగులో ఈ కాలువ పూడికతీత పనులను రూ 6,75,434 లు అంచనా వ్యయంతో ప్రారంభించినట్లు పేకేరు నీటి సంఘం అధ్యక్షులు నల్ల సురేంద్ర మేజర్ న్యూస్ కు తెలియజేశారు. ఈ పనులను శ్రీనివాస ఇంజనీరింగ్ వర్క్స్ ఖండవల్లి వారు నిర్వహిస్తున్నారని ఆయన తెలియజేశారు.

# మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య



**పెద్దాపురం, మేజర్ న్యూస్** : ఆదర్శనేత మహోన్నత వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు దువ్వా శేషు బాబ్జీ అన్నారు. సోమవారం పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నేత స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమం నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దువ్వా శేషుబాబ్జీ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం సిపిఎం మండల కార్యదర్శి క్రాంతికుమార్, సిరపురపు శ్రీనివాస్, స్నేహ, డి.కృష్ణంరాజు, సత్యనారాయణ, నరసింహమూర్తి, రమేష్, అరుణ్, మరిడయ్య, పెంటయ్య, కరణం గోవిందు, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన ఏపి ఈఏపిసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష



| District | 19th May S1 Allotted | 19th May S1 Present | May S2 Allotted | S2 Present | Total Allotted | Total Present | Attendance % |
|---|---|---|---|---|---|---|---|
| ANAKAPALLE | 95 | 84 | 95 | 91 | 190 | 175 | 92.11 |
| ANANTAPUR | 1411 | 1266 | 1407 | 1273 | 2818 | 2539 | 90.10 |
| ANNAMAYYA | 622 | 586 | 617 | 567 | 1239 | 1153 | 93.06 |
| BAPATLA | 274 | 258 | 276 | 261 | 550 | 519 | 94.36 |
| CHITTOOR | 437 | 398 | 437 | 400 | 874 | 798 | 91.30 |
| EAST GODAVARI | 643 | 594 | 657 | 610 | 1300 | 1204 | 92.62 |
| ELURU | 502 | 472 | 501 | 478 | 1003 | 950 | 94.72 |
| GUNTUR | 1038 | 970 | 1038 | 960 | 2076 | 1930 | 92.97 |
| KAKINADA | 922 | 844 | 923 | 869 | 1845 | 1713 | 92.85 |
| KONASEEMA | 401 | 372 | 402 | 387 | 803 | 759 | 94.52 |
| KRISHNA | 291 | 282 | 292 | 276 | 583 | 558 | 95.71 |
| KURNOOL | 1597 | 1492 | 1593 | 1508 | 3190 | 3000 | 94.04 |
| NANDYAL | 713 | 659 | 711 | 659 | 1424 | 1318 | 92.56 |
| NTR | 1700 | 1555 | 1700 | 1546 | 3400 | 3101 | 91.21 |
| PALNADU | 480 | 436 | 482 | 462 | 962 | 898 | 93.35 |
| PRAKASAM | 846 | 758 | 846 | 784 | 1692 | 1542 | 91.13 |
| SRI POTTI SRIRAMULU NELLORE | 687 | 625 | 695 | 652 | 1382 | 1277 | 92.40 |
| SRI SATHYA SAI | 102 | 96 | 101 | 95 | 203 | 191 | 94.09 |
| SRIKAKULAM | 969 | 904 | 967 | 898 | 1936 | 1802 | 93.08 |
| TIRUPATI | 1238 | 1137 | 1220 | 1140 | 2458 | 2277 | 92.64 |
| VISAKHAPATNAM | 2285 | 2070 | 2279 | 2081 | 4564 | 4151 | 90.95 |
| VIZIANAGARAM | 1081 | 1003 | 1081 | 1006 | 2162 | 2009 | 92.92 |
| WEST GODAVARI | 1002 | 908 | 1004 | 942 | 2006 | 1850 | 92.22 |
| YSR | 860 | 781 | 859 | 803 | 1719 | 1584 | 92.15 |
| Hyderabad | 265 | 174 | 273 | 183 | 538 | 357 | 66.36 |
| Grand Total | 20461 | 18724 | 20456 | 18931 | 40917 | 37655 | 92.03 |

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన ఏపి ఈఏపిసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష మొదటిరోజు మే 19వ తేదీ సోమవారం నుండిరాష్ట్రవ్యాప్తంగా మరియు హైదరాబాద్‌లో ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఏపి ఈఏపిసెట్ ఛైర్మన్ మరియు ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్కె.ప్రసాద్ తెలిపారు.సోమవారం ఉదయం ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్కె.ప్రసాద్, యూనివర్శిటీ అధికారులు, ఏపి ఈఏపిసెట్ కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు, కో-కన్వీనర్లు మరియు కో-ఆర్డినేటర్లతో కలిసి సెట్‌కోడ్‌ను విడుదల చేసి పరీక్ష నిర్వహణా తీరును పరిశీలించారు. మొదటి రోజు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మరియు హైదరాబాద్‌లో ప్రారంభమైన ఏపి ఈఏపిసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఈఏపిసెట్ ఛైర్మన్ మరియు ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్ కె.ప్రసాద్ గారుతెలిపారు.అగ్రికల్చర్ & ఫార్మశీ విభాగానికి సంబంధించి మొదటి రోజు సోమవారం ఉదయం 20,461 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 18,724 మంది పరీక్షకు హాజరయ్యారని, 1737మంది గైర్హాజరైనట్లు కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు తెలిపారు. మొత్తం 91.51 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. అలాగే సోమవారం మధ్యాహ్నం 20,456 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 18,931మందిపరీక్షకు హాజరయ్యారని, 1525మంది గైర్హాజరు కాగా మొత్తం 92.54శాతంమందివిద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. మొత్తంగా 40,917మంది పరీక్షకుహాజరు కావాల్సి ఉండగా37,655మంది పరీక్షకు హాజరయ్యారని, 3262మంది గైర్హాజరు కాగా92.03శాతంమంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అలాగే కాకినాడ జిల్లాలో అగ్రికల్చర్ &ఫార్మశీ విభాగానికి సంబంధించి మొదటి రోజు సోమవారం ఉదయం 922మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 844మంది పరీక్షకు హాజరయ్యారని, 78మంది గైర్హాజరైనట్లు కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు తెలిపారు.మొత్తం 91.54శాతంమంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యార న్నారు. అలాగే సోమవారం మధ్యాహ్నం 923మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 869మంది పరీక్షకు హాజరయ్యారని, 54మంది గైర్హాజరు కాగా మొత్తం 94.15శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నా రు. మొత్తంగా 1845మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1713మంది పరీక్షకు హాజరయ్యారని, 132మంది గైర్హాజరు కాగా 92.85 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు కన్వీనర్ ప్రొ.వి.వి. సుబ్బారావు తెలియజేశారు.ఏపి ఈఏపిసెట్‌ఛైర్మన్&ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్ కె.ప్రసాద్ వెంటఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు,కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు, కో-కన్వీనర్లు, కో-ఆర్డినేటర్లు, టిసిఎస్ మరియు ఏపి ఆన్‌లైన్ అధికారులు ఉన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీలో ప్రారంభమైన 5రోజుల ప్రొఫెషనల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం



**గండేపల్లి,మేజర్‌న్యూస్:** గండేపల్లి మండలం ఆదిత్య యూనివర్సిటీ ప్రెష్మ్యాన్ ఇంజనీరింగ్ విభాగంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ వారి సౌజన్యంతో ఫౌండేషన్ ఆఫ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ అనే అంశంపై 5రోజుల ప్రొఫెషనల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఉత్సాహంగా ప్రరమైనట్లు ఆదిత్య డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా.ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ప్రపంచానికి అనుగుణంగా ఉపాధ్యాయవృత్తిలో అవసరమైనమెళకువలు, విద్యార్థుల మానసికస్థితికి అనుగుణంగా అధ్యాపకులు వారివృత్తి నైపుణ్యాలు అభివృద్ధి చేసుకొనుటకు ప్రొఫెషనల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలు ఎంతోఅవసరం అని డా.శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు.ఈసందర్భంగా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసర్చ్ చెన్నై నుంచి వచ్చిన ప్రతినిధులు ప్రొఫెసర్ ఎమ్.శ్రీనువాసన్,ప్రొఫెసర్ వందన దేవి నేతృత్వంలో అధ్యాపక వృత్తిలో వివిధ నైపుణ్య అంశాలపై అవగాహన మరియు డిజిటల్ టీచింగ్‌పై ఈఅయిదురోజుల శిక్షణకార్యక్రమం ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.ఎం.బి.శ్రీనివాస్, ప్రో. వైస్ ఛాన్సలర్ డా.ఆదిరెడ్డి రమేష్, డా.ఎస్.రమాశ్రీ,రిజిస్ట్రార్ డా.జి.సురేష్,కో.ఆర్డినేటర్ డా.జి.చిన్నారావ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మార్పీ ధర కంటే అధికంగా వసూలు చేస్తే జరిమానా

**- రాష్ట్ర లీగల్ మెట్రాలజీ (తూనికలు కొలతలు) శాఖ ఇన్స్పెక్టర్ కుటుంబరావు**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లీగల్ మెట్రాలజీ (తూనికలు కొలతలు) శాఖ ఇన్స్పెక్టర్ కుటుంబరావు ఆధ్వర్యంలో రామచంద్రపురం ఆర్టీసీ డిపో సమాచార కేంద్రం నందు వస్తు వినియోగదారులు వస్తు విక్రయదారులకు సమావేశం నిర్వహించారు. మరియు వినియోగదారునికి ఏ వస్తువు అమ్మిన ఎమ్మార్పీ ధర కంటే ఏ విధమైన అదనపు రుసుము వసూలు చేయరాదని అట్లు వసూలు చేసిన జరిమానా విధించబడును అని తెలియజేశారు. డిపో మేనేజర్ గారు శ్రీ భాస్కర రావు గారు ఏ వస్తువు కొన్న సరైన ధర వస్తువు యొక్క సమయము తేదీ ప్రతి వినియోగదారుడు సరిచూసుకొని కొనవలెనని, చిన్న పిల్లలు తినే బిస్కెట్ ప్యాకెట్లు ముఖ్యంగా సరైన తేదీ ఉందో లేదో కొనే ముందు జాగ్రత్త వహించవలెనని, ఏ విధమైన వస్తువు కొనుగోలు చేసిన దాని ధరను మాత్రమే చెల్లించవలెను అట్లు కాక అదనంగా వసూలు చేసిన యెడల టోల్ ఫ్రీ నెంబర్ 1967 ఫోన్ చేయవలెనని సూచించారు. ముఖ్యంగా మనం తీసుకునే మందులు విషయంలో కూడా ఎక్స్పైరీ డేట్ మన వాడే సమయము సరిచూసుకోవాలని చెప్పారు. ఈ సమావేశమునకు కార్మికులు ఆఫీసు సిబ్బంది వస్తువు విక్రయదారులు వినియోగదారులు, ప్రయాణికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. లీగల్ మెట్రాలజీ శాఖ వారు వినియోగదారుడు తెలుసుకోవాల్సిన విషయాలపై కరపత్రంలో పంపిణీ చేశారు.

# పోలేరమ్మ జాతరలో సాయిశ్రీప్రియ శిష్య బృందం నృత్య ప్రదర్శన

**-కళ్ళు మిరుమిట్లు కొలిపే బాణసంచా తిలకించి భక్తులు పరవశం**



**పెరవలి, మేజర్‌న్యూస్ :** ఖండవల్లి గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా మూడవరోజు మే 18వ తేదీ ఆదివారం రాత్రి జరిగిన నృత్యప్రదర్శన కార్యక్రమం ఆద్యంతం అలరించింది.. ఖండవల్లి గ్రామానికి చెందిన అంతర్జాతీయ నృత్య కళాకారిణి కుమారి నరుకుల సాయిశ్రీప్రియ (డిప్లమో ఇన్ కూచిపూడి) వారి శిష్యబృంధంచే ప్రదర్శించిన గణేష్ స్తుతి,రావణాష్టకం, గోపికా నృత్యం,అమ్మోరు, అయిగిరినందిని మొదలగు నృత్యాంశాలను వేలాదిగా తరలి వచ్చిన గ్రామ ప్రజలు, పుట్టింటి ఆడపడుచులు ఆనందంతో తిలకించి పులకించి పోయారు. జాతరకమిటీ సభ్యులు నృత్య ప్రదర్శన చేసిన కళాకారులను అభినందించారు.

నృత్యప్రదర్శన అనంతరం ద్రాక్షారామం వారిచే భారీ స్థాయిలో బాణాసంచా కార్యక్రమం కళ్ళు మిరుమిట్లు గొలిపే వెలుగులు చిమ్ముతూ ఆకాశం అంతా దీప కాంతులను సంతరించుకుని చాలా అద్భుతంగా జరిగినది.

# జర్నలిస్టులపై అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

**-అసభ్యకర పోస్టులు చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు**




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** సామాజిక మాధ్యమాలలో (ఫేస్బుక్, వాట్సప్, ఇన్స్టాగ్రామ్) లలో వ్యక్తుల మరియు జర్నలిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ... అసభ్యకర మరియు అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు చేస్తూ... బెదిరింపులకు పాల్పడుతూ పెడుతున్న వారిపై పిఠాపురం జర్నలిస్టులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న జర్నలిస్టులపై తప్పుడు ప్రచారాలను బెదిరింపులను సహించేది లేదన్నారు. వ్యక్తిత్వహననానికి పాల్పడుతూ పోస్టులు పెట్టే వ్యక్తులు సంఘానికి సమాజానికి చీడపురుగు వంటి వారని, అలాంటి వారిపై పోలీసులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవలసిన అవసరం, ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం జర్నలిస్ట సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఎం.రవి కిషోర్‌కి జెఎన్టీయుకె పిహెచ్‌డి

**కాకినాడ, మేజర్ న్యూస్ :** నిపుణుల బృందం సిఫార్సు మేరకు ఎం.రవి కిషోర్ సిద్ధాంత వ్యాసం "డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ సబ్‌స్ట్రేట్ ఇంటిగ్రేటెడ్ వేవ్‌గైడ్ బేస్డ్ కేవిటీ బ్యాక్డ్ యాంటెన్నాస్ ఫర్ మైక్రోవేవ్ కమ్యూనికేషన్స్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగంలో లభించినది. ఎం.రవి కిషోర్ తన సిద్ధాంత వ్యాసాన్ని విజయనగరంలోని జెఎన్‌టియుజివి యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విజయనగరం (యుసిఇవి) ఈసిఈ విభాగం ప్రొఫెసర్ కె. చంద్రభూషణరావు ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

# 'ఆదివాసీ' దీక్షలకు మెడికల్ ఎంప్లాయిస్ మద్దతు





**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆదివాసీ జేఏసీ చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ తృప్తి జోగారావు, నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్స్ మధు, వీరన్న సోమవారం మద్దతు ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ముందు 5వ రోజు ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు కార్యక్రమానికి ఆదివాసి జేఏసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కంగల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఆదివాసీలు రిలే నిరాహార దీక్షలు సందర్భంగా ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తృప్తి జోగారావు మాట్లాడుతూ 2025 మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ ఆదివాసీ ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తామని ఎన్నికల ముందు అరకులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఐటిడిఏ ద్వారా ట్రైకార్ రుణాలు నిరుద్యోగ యువతకు మంజూరు చేసి ఉపాధి కల్పించాలని మొదలైన సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆదివాసి జేఏసీ చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. ఈసందర్భంగా ఆదివాసీ అడ్వకేట్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు ఆత్రం నవీన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1) ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న ఆదివాసీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పేరా -4 ప్రకారం ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించుకోవచ్చు అన్నారు. కానీ నేటికీ షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేసే ఎమ్మెల్యేలు అందరిని ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ కమిటీ ఏర్పాటు చెయ్యకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ కమిటీ తక్షణమే ఏర్పాటు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆదివాసి నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సోమవారం ఐటీడీఏ గ్రీవెన్స్‌లో ఆదివాసీ నాయకులు పిఓ ను కలిసి ముఖ్యమంత్రికి విజ్ఞాపనలు పంపించమని వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఆదివాసీలు రిలే నిరాహార దీక్షలు కార్యక్రమంలో పెద గెడ్డాడ సర్పంచ్ వడగల ప్రసాద్ బాబు, పొడియం పండు దొర, చవలం శుభకృష్ణ దొర, పండా పవన్ కుమార్ దొర, మడకం వరప్రసాద్ దొర, కడబాల రాంబాబు రెడ్డి, కారం రంగారావు దొర, ఆదివాసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, కారం రామన్న దొర, కారం చిన్నికృష్ణ, పండా భద్రం దొర, చిలకల సత్యనారాయణ, కొండకాపు సంఘం అధ్యక్షులు, కారుకోడి గాంధీబాబు, బొరగ పొట్టిదొర, కుంజం అగ్గిదొర, కుంజం వెంకన్నదొర, తుర్రం వీరబాబు, కారం రామన్నదొర, బొరగ గంగరాజు పాల్గొన్నారు.

# రక్తపోటు నివారణ మన చేతుల్లోనే




**అమలాపురం, మేజర్ న్యూస్ :** ప్రాణాంతకమైన రక్త పోటు వ్యాధని, ప్రతి ఒక్కరూ వ్యాధి నియంత్రణ చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి నుండి నల్ల వంతెన వరకు ప్రపంచ రక్తపోటు దినోత్సవ ర్యాలీని రక్తపోటు నివారణ చర్యల నినాదాలతో నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఏడాది మే 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహించడం జరుగు తుందన్నారు. రక్తపోటు స్థాయి సాధారణ స్థాయి కంటే పెరగడాన్నే హైపర్టెన్షన్ అంటారన్నారు. ఇది చాలా ప్రాణాంతకమైన వ్యాధని, అధిక రక్తపోటు లేదా హై బీపీను సైలెంట్ కిల్లరని పిలుస్తారన్నారు. హైపర్టెన్షన్ పై అవగాహన పెంచేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. హైపర్టెన్షన్తో బాధపడుతున్న వారు స్ట్రోక్, గుండె జబ్బులు, మూత్రపిం డాల రుగ్మతలు వంటి ఇతర ఆరోగ్య పరిస్థితుల ప్రమాదాన్ని కూడా ఎదుర్కొంటారన్నారు. అధిక ఒత్తిడి రక్తపోటుకు దారి తీయవచ్చునన్నారు. అధిక రక్తపోటు లేదా హైపర్టెన్షన్ గురించి అవగాహన పెంచడానికి ఈ దినం ఉద్దేశింపబడిందన్నారు. అధిక రక్తపోటు యొక్క ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన పెరగాల్సి ఉందన్నారు. ఈ వ్యాధి మూలంగా తీవ్రమైన తలనొప్పి, ఛాతి నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వికారం, వాంతులు, అస్పష్టమైన దృష్టి లేదా ఇతరదృష్టి మార్పులు, ఆందోళన, గందరగోళం చెవుల్లో శబ్దాలు, ముక్కు రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఆహారంలో ఉప్పును బాగా తగ్గించడం, శారీరకంగా చురుగా ఉండటం, ధూమపానం, మద్య పానాన్ని మానేయడం, బరువు ఎక్కువగా ఉంటే తగ్గించుకోవడం అంటే చర్యలు చేపట్టాలన్నారు. కూరగాయలు పండ్లు ఎక్కువ తీసుకోవడం, గంటల తరబడి కూర్చోకుండా ఉండటం, నడక, పరుగు, ఈత, డ్యాన్స్ లేదా బరువులు ఎత్తడం లాంటి వ్యాయా మాలు చేయాలన్నారు. రక్తపోటు నివారణ మన చేతుల్లోనే ఉందని ఆరోగ్యకరమైన అలవాట్లతో రక్తపోటును నియంత్రించవ చ్చునన్నారు. ప్రజలు వారి రక్తపో టునుక్రమంతప్పకుండా తనిఖీ చేసుకోవాలన్నారు. రోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడం ద్వారా రక్తపోటును నివారించుకోవచ్చునన్నారు. "మీ రక్తపోటును ఖచ్చితంగా కొలవండి.. ఎక్కువ కాలం జీవించండి" అనే ఇతి వృత్తంతో ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. ఈ దినోత్సవం రక్తపోటు పర్యవేక్షణ సమర్ధవంతమైన నిర్వహణ యొక్క ప్రాము ఖ్యతను నొక్కి చెబుతుందన్నారు. అందువల్ల, ప్రజలందరూ తమ రక్తపోటు గురించి తెలుసుకోవడం, అవసరమైన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఎం & హెచ్ఓ సిహెచ్.వి.భరతలక్ష్మి, ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమలత, ప్రాంతీయ ఆసుపత్రి సిబ్బంది రాఘవేంద్రరావు, వెంకట్ రామకృష్ణ, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వరునికి బంగారు పంచ పాత్రలు బహుకరణ



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారికి సోమవారం కొత్తపేట మాజీ ఎమ్మెల్యే ఎం.వి.ఎస్. సుబ్బరాజు కుమారుడు వెంకట కృష్ణంరాజు కుటుంబ సభ్యులు రూ.22 లక్షల విలువైన 209.84 గ్రాముల పంచ పాత్రలు, 318 గ్రాముల వెండి కంచం బహుకరించారు. వీరికి దేవస్థానం అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటం అందించి అభినందించారు. వీటిని స్వామివారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

# ద్విచక్ర వాహనం చోరీ



**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** కొత్తపల్లి మండలం విలేకరిగా విధులు నిర్వహిస్తున్న తోట శాంతి కుమార్ ద్విచక్ర వాహనం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆదివారం రాత్రి 9 గంటల 30 నిమిషాలకు ఉప్పాడ సురేష్ శారీస్ వద్ద ఎపి5 ఎఎం7236 గల బైక్ తాళం వేసి నిలుపుదల చేశాడు. పక్కనే ఉన్న అంబికా ఇన్ రూమ్ లో ఉన్న బంధువుల వద్దకు వెళ్లాడు. అక్కడ రాత్రి ఉండగా సోమవారం ఉదయం 6 గంటల సమయంలో బైకు నిలుపుదల చేసిన చోటకు వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రదేశాల్లో వెతక ఎక్కడ ఆచూకీ లేకపోవడంతో యు.కొత్తపల్లి పోలీసులకు శాంతికుమార్ ఫిర్యాదు చేశాడు.

# వెంకన్న ముఖద్వారానికి శంకుస్థాపన



**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముఖద్వారాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. రావులపాలెంలో జాతీయ రహదారి చెంతనే ఉన్న కళా వెంకట్రావు విగ్రహం సమీపంలో ఈ కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణానికి ముఖ్య దాతగా సిఎంఆర్ షాపింగ్ మాల్స్ గ్రూప్ చైర్మన్ శ్రీ మావూరి వెంకటరమణ దంపతులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సిఎంఆర్ చైర్మన్ దంపతులు ముఖద్వారం నిర్మాణానికి శాస్త్రోత్తంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్ రావు మాట్లాడుతూ ఏడు వారాల వెంకన్నగా విరాజిల్లుతున్న చందన స్వరూపుడు వెంకటేశ్వర స్వామి రావులపాలెంలో ముఖద్వారం నిర్మించేందుకు సిఎంఆర్ షాపింగ్ మాల్స్ అధినేత వెంకటరమణ ముఖద్వారం నిర్మించేందుకు ముందుకు రావడం ఎంతో శుభసూచికమన్నారు. ముఖద్వారాల నిర్మాణం పూర్తి అయిన తరువాత భక్తులకు మరింత సౌకర్యవంతమైన అనుభవం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. భక్తజనం నుండి కూడా ఈ చర్యకు విశేష స్పందన లభించింది.